కథ

# పండుగొచ్చింది

డా॥ కొఠారి వాణీచలపతిరావు

సంక్రాంతి పండుగొస్తోందంటే నాకెంతో సంతోషంగా వుంటుంది. ప్రతి సంక్రాంతికి మేము మా అమ్మమ్మగారి వూరికి వెళ్తాం. అక్కడ అందరం కల్సి ఎంతో ఆనందంగా గడుపుతాం. నిజానికి సంక్రాంతి పండుగ చూడాలంటే పల్లెటూర్లలోనే చూడాలి. సిటీలో ఏడెనిమిది అంతస్తుల ఎపార్ట్‌మెంట్‌లో ఏదో ఒక మూల ఓ ఫ్లాట్‌లో గూటిలో పక్షిలా కాపురముండే మాకు అసలు సంక్రాంతి పండుగ అందాలు ఎలా కనిపిస్తాయి? ఓ ముగ్గులా, గొబ్బెమ్మలా, హరిదాసు పాటలా? అందుకే తప్పని సరిగా మేము సంక్రాంతికి మా అమ్మమ్మగారి వూరికి ప్రయాణం అవుతాం. ఆ సంవత్సరం ఏవో పనుల వల్ల నాన్నగారు రాలేకపోయారు. అమ్మ బాధ పడుతూ వుంటే 'పెళ్ళయి పాతిక సంవత్సరాలైనా ఇంకా కొత్తల్లుడిలా నేను పండుగకు అత్తారింటికి రావటం ఏమిటోయ్ నువ్వు, శిరీష వెళ్ళిరండి.' అన్నారు.

ఆ మర్నాడే మా ప్రయాణం.

నాన్నగారు స్టేషనుకు వచ్చి మమ్మల్ని ట్రయిన్ ఎక్కించారు. "నేను ముందుగానే టెలిగ్రాం ఇచ్చాను గనుక మీ తమ్ముడు స్టేషన్‌కు వస్తాడు. జాగ్రత్తగా వెళ్ళిరండి" అని వీడ్కోలు పలికారు. ట్రయిన్ ముందుకు కదిలి రానురాను వేగం అందుకుంది. నాలుగు గంటల ప్రయాణం తర్వాత మేము దిగవలసిన స్టేషన్ వచ్చింది. పసుపు పచ్చటి బోర్డు మీద 'మధిర' అన్న నల్లటి అక్షరాలు చూసి "అమ్మా! ఊరొచ్చింది" అని కేక పెట్టాను. బయటికి చూడగానే ఫ్లాట్‌ఫారమ్ మీద దివాకర్ మామయ్య కనిపించాడు. మమ్మల్ని చూడగానే చిరునవ్వుతో మా కంపార్ట్‌మెంట్ దగ్గరకు వచ్చి "బాగున్నావా అక్కయ్యా. బావగార్ని ఈసారి రాకపోవటం ఏమీ బాగోలేదే" అంటూ మా చేతిలోని సూట్‌కేస్ అందుకున్నాడు. నా నెత్తిన ఒక్క మొట్టికాయ వేస్తూ "ఈ శిరీష ఏమిటి ఒక సంవత్సరంలోనే ఇంత పొడుగు ఎదిగిపోయింది" అన్నాడు.

'మధిరలో రైలుదిగితే మా అమ్మమ్మగారి ఊరు' మడిపల్లి చేరుకోవటానికి ఎడ్లబండి మీద ఓ గంట పడుతుంది. జీతగాడు వీరయ్య ఏదో పదం పాడుతూ బండితోలుతున్నాడు. అతని పాటకు మ్యూజిక్ అందిస్తున్నట్లు ఎడ్ల మెళ్ళో గంటలు గల గలామోగుతున్నాయి.

పచ్చటి చెట్లు, పంట పొలాలు కన్నుల పండువ చేస్తున్నాయి. ఏటి మీద నుండి వీచే చల్లగాలులు శరీరానికి తాకి ప్రయాణపు బడలికను ఇట్టే పోగొడుతున్నాయి.

ప్రకృతికి పరవశించడం, సహజ సిద్ధ అందాలను పదిలంగా హృదయంలో దాచుకోవడం నాకు చిన్నప్పటి నుండి అలవాటు. దానికి తోడు కొంత భావుకురాల్ని కావడం వల్ల మనసులో మెదిలో భావ చిత్రాలను, కంటికి కనిపించిన ప్రకృతిని చిన్న చిన్న కథల్లో, కవితల్లో పొదగడం అలవరచుకున్నాను. అమ్మకు నా విషయం తెల్సు గనుక "మా శిరీషకు పల్లెటూర్లంటే మహా ఇష్టం" అంది మామయ్యనుద్దేశించి.

మామయ్య నన్ను ఏడిపించటానికి అవకాశం కోసం ఎదురు చూస్తూంటాడులా వుంది. "పొరబాటున నేను దానికంటే పదిహేనేళ్ళు ముందు పుట్టబట్టి గానీ లేకపోతే దాన్ని నేనే పెళ్ళి చేసుకుని ఈ పల్లెటూర్లోనే కాపురం పెట్టించేవాడ్ని కాదూ" అన్నాడు నవ్వుతూ.

అమ్మ కూడా చిరునవ్వు నవ్వింది మామయ్య మాటలకు. నాకు అలాంటి జోక్స్ మోటుగా అనిపిస్తాయి. అయినా నా అయిష్టాన్ని బయటికి వ్యక్తం చేయలేదు మామయ్య బాధపడతాడని. మాట కాస్త మోటయినా మామయ్య మనసు మాత్రం అప్పుడే తీసిన వెన్న లాంటిదని నాకు తెల్సు.

బండి ఊరి పొలిమేరల్లోకి చేరుకుంది.

అమ్మ తను పుట్టిన ఊరును అపురూపంగా, ఆప్యాయంగా వళ్ళంతా కళ్ళు చేసుకుని చూసుకుంటున్నది.

సంవత్సరానికి ఒకసారి వస్తున్నా ఎన్నో ఏళ్ళుగా ఆ ఊరు చూడనట్లు అనిపిస్తుంది కాబోలు అమ్మకు. ఆడపిల్లకు పుట్టింటి మీది అభిమానం అలాంటిది. రేపు నాకు పెళ్ళయితే బహుశ నేనూ అంతేనేమో అనుకున్నా నేను. బండి శబ్దం విని ఎవరో వచ్చి ఇంటి ముందున్న పెద్ద గేటు తెరవగానే బండి ఆవరణలోకి వెళ్ళింది. ఉదయం పెట్టిన ముగ్గులు మాకు స్వాగతం పలుకుతున్నట్లుగా వున్నాయి వాకిట్లో. "వచ్చి రాగానే శిరీష దృష్టి ముగ్గుల మీద పడింది" అంది అత్తయ్య అమ్మకూ, నాకూ కాళ్ళకు నీళ్ళిస్తూ. అమ్మమ్మ ఆప్యాయంగా నన్ను దగ్గరికి తీసుకుంది. అమ్మను క్షేమ సమాచారాలు అడిగింది. నాకిష్టమైన చక్కిలాలు, అరిసెలు పెట్టింది.

"అల్లుడుగారు రానేలేదు" అంది అమ్మమ్మ నిష్టూరంగా. "పాత అల్లుడు ఆయన సంగతి అలా వుంచు గానీ, నీ కొత్త అల్లుడు ఏడే అమ్మా శారదా వాళ్ళు ఇంకా రాలేదేమిటి.. వాళ్ళకు ఇది తొలి పండుగ కదా" అంది అమ్మ

"వాళ్ళు రేపు వస్తామని రాశారు. మీ మరిది గారికి రెండు రోజుల కన్నా ఎక్కువ వుండటానికి వీలు పడదట" అంది అమ్మమ్మ సమాధానంగా.

శారద పిన్ని వస్తుందన్న వార్త నాకు సంతోషం కలిగించింది. శారద వరుసకు నాకు పిన్ని అయినా స్నేహితురాలిలాంటిది. దాదాపు సమ వయస్కులం కావటం, చిన్నప్పటి నుండి కలిసి మెలిసి తిరగటం, ఆడుకోవడం వల్ల మాకు మంచి సహవాసం ఏర్పడింది. ఆ మర్నాడు భోగి పండుగ.

'బొమ్మలకొలువు తీర్చండర్రా' అని అమ్మమ్మ అనడంతో అటక మీది నుండి బొమ్మలన్నీ దింపి శుభ్రంగా దులిపి వరుసక్రమంలో ఒకరోజు ముందుగానే అందంగా అమర్చాను.

రాత్రి బండికి దిగిన శారద పిన్ని, ఆమె భర్త ఇంకా బెడ్‌రూమ్‌లో నుండి బయటకు రాలేదు.

ముసి ముసి చీకట్లతోనే తొలి కోడి కూత వినబడగానే దిగ్గున లేచి కూర్చున్నాను.

అమ్మమ్మ అత్తయ్య నా ఆరాటం చూసి నవ్వుకున్నారు.

"మీ అమ్మ కన్నా నువ్వే నయమే శిరీషా. అది పెళ్ళయి పట్నం కాపురం పెట్టినప్పటి నుండి పల్లెటూరి అలవాట్లు, పద్ధతులు అన్నీ మర్చిపోయింది" అంది అమ్మమ్మ. ఆలస్యంగా లేవటానికి అలవాటు పడ్డ అమ్మ నుద్దేశించి.

అమ్మమ్మ ముగ్గులేయటంలో ఆమెకు ఆమే సాటి.

నాలుగువేళ్ళ మధ్యలో నుండి ఒడుపుగా ఇంత అంత గీత వంకర రాకుండా చకచకా రథం ముగ్గూ, ఉయ్యాల చీర, కృష్ణుని నాభి, స్వర్గ వాకిళ్ళు వంటి రకరకాల ముగ్గులు వేసుకుంటూ పోతున్నది.

నేను ముగ్గు గొట్టంతో నాగుపాము, తాబేలు, తామర పూల ముగ్గులు వేసాను. మేము ముగ్గులు వేస్తూ వుంటే అత్తయ్య పసుపుకుంకాలు చల్లుతూ గొబ్బెమ్మలు తీరుస్తూ వుంది. మా పని ముగిసాక చేతులు కడుక్కొని వచ్చి అరుగు మీద నిల్చుంటే వాకిలంతా రంగు రంగుల రంగవల్లులతో ఎంతో అందంగా కనిపించింది.

నా ముగ్గు బాగుందంటే, నా ముగ్గు బాగుందని అమ్మమ్మ నేను వాదించుకున్నాం.

అప్పుడు బద్ధకంగా వళ్ళు విరుచుకుంటూ బయటికి వచ్చింది శారద పిన్ని.

పిన్నిని చూడగానే నాకు గడచిన సంక్రాంతి గుర్తు కొచ్చింది. "ఏమమ్మా పెళ్ళయి, మొగుడు రాగానే సంక్రాంతి పండుగను మర్చిపోయావే. ఇంతకు ముందు మనం ఇద్దరం పోటీలు పడి ముగ్గులేసే వాళ్ళం. నాలుగు వీధులు తిరిగి ఎవరి ముగ్గులు ఎలా వున్నాయో ముచ్చటించుకునే వాళ్ళం. ఎంచక్కా బొమ్మల కొలువు తీర్చే వాళ్ళం. గుర్తు లేదా?" అన్నాను కోపంగా ముఖం పెట్టి.

"రేపు నీ పెళ్ళయితే నువ్వూ అంతేనే శిరీషా" అంది అత్తయ్య నవ్వుతూ.

"నేను అలా మారిపోను. ముఖ్యంగా సంక్రాంతి పండుగను అసలే మర్చిపోను," అన్నాను ఖచ్చితంగా.

"శారదా!" బెడ్‌రూమ్‌లో నుండి కొత్తల్లుడి కేక వినిపించడంతో శారద పిన్ని హడావుడిగా లోపలికి పరుగెత్తింది.

వాళ్ళు వచ్చినప్పటి నుండి గమనిస్తున్నాను. పిన్ని పెళ్ళయిన తరువాత చాలా మారిపోయింది. అస్తమానం మొగుడి అడుగులకు మడుగులొత్తుతూ అతని కూడా కూడా తిరుగుతున్నది. ఆయన మాట వేదం అన్నట్లు, ఏ కాస్త లోపం జరిగినా ఆయనకు కోపం వస్తుందన్నట్లు ప్రవర్తిస్తున్నది. పెళ్ళి కాగానే ఆడపిల్ల తన

స్వేచ్ఛను, ఇష్టాయిష్టాలను త్యాగం చేయకతప్పదా?" అనుకున్నాను మనసంతా చోటు చేసుకున్న ఉదాసీనతతో. ఇంతలో నా హుషారును తిరిగి రాబట్టడానికన్నట్లు 'హరిలో రంగ హరీ' అంటూ చిరుతల లయకు అనుగుణంగా అడుగులు వేస్తూ హరిదాసు వచ్చాడు. "అమ్మాయి శిరీషా. హరిదాసుకు కాసిని బియ్యం వెయ్యమ్మా!" అని కేకేసింది, చల్ల చిలుకుతున్న అమ్మమ్మ వంటింట్లో నుండి.

ఎర్రటి పట్టువస్త్రాలు, నామాలు, నెత్తిన తళతళ మెరిసే ఇత్తడి పాత్రతో హరిదాసు రూపం ముచ్చటగా అనిపించి వెంటనే లోపలికి వెళ్ళి కెమెరా తెచ్చుకొని ఒక ఫోటో తీసుకున్నాను. నేను ఇత్తడి పాత్రలో బియ్యం వేస్తూ వుంటే 'కృష్ణార్పణం' అంటూ మళ్ళీ పాట పాడుతూ వీధిలోకి వెళ్ళిపోయాడు హరిదాసు.

ఆ రోజు అమ్మమ్మ కొత్త బియ్యంతో పులగం చేసింది కలగలుపుల కూర వండింది.

కొత్త అల్లుడు కూడా ఉన్నాడని ఆ రోజు బొబ్బట్లు, కజ్జికాయలు చేశారు. 'ఇవేం వంటకాలు. కంట్రీ వంటకాలు' అని చిరుబురు లాడాడట ఆ మహానుభావుడు. శారద పిన్ని చెప్పింది తరువాత.

పండుగలు మన సంప్రదాయా లకు, ఆచార వ్యవహారాలకు ప్రతీ కలు. నలుగురు కలిసి మెలిసి ఒక చోట కూడి ఆనందంగా గడపటానికి, మనసులోని పొరపొచ్చాలను భేద భావాలను మర్చిపోవడానికి పండు గలు ఉపయోగపడతాయి.



పండుగనాడు తింటానికి మెతుకు లేని నిరుపేద సైతం ఇన్ని పాలు పొంగించుకొని అందులో ఇంత బియ్యం, బెల్లం వేసి పరమాన్నం వండుకొని అదే మృష్టాన్న భోజనంగా భావిస్తాడు. అదే మన పండుగనాడు ఇంటికి వచ్చిన శత్రువునైనా అతిథిగా భావించి ఆదరించటం, పొరుగింటి ఆడపిల్లనైనా తమ ఆడపడుచుగా భావించి పసుపు కుంకుమలు పెట్టి పంపించడం మన సంప్రదాయం. ఇలాంటి విషయాలన్నీ గ్రహించలేని వాళ్ళు తమ యాంత్రిక జీవితం నుండి బయటకు రాలేరు. వచ్చినా చిరు బురులు, కోపాలు తప్ప పండుగ నాడైనా ఆనందంగా గడపలేరు.

సంక్రాంతి రైతులకు పంటల పండుగ.

సంవత్సరమంతా కష్టపడి పండించిన పంట ఇంటికి చేరే రోజు అది. అందుకే ఏ యింట్లో చూసినా నవధాన్యాలు కొత్త వాసనలు వెదజల్లుతూ వుంటాయి. పాడి పుష్కలంగా కుండల నిండుగా పొంగిపొర్లుతూ ఉంటుంది. ధనలక్ష్మి ధాన్యలక్ష్మి రూపంలో ఇటింటా కొలువు తీరే ఆ సమయంలోనే రైతుల చేతుల్లో నాలుగు డబ్బులు వుండేది.

మామయ్య అమ్మకు, రాకపోయినా నాన్నకు; శారద పిన్నికి, ఆమె భర్తకు కొత్త బట్టలు తెచ్చాడు. ఎంత వద్దన్నా నా చేతిలోనూ ఒక షిఫాన్ చీర పెట్టింది అత్తయ్య. బొట్టు పెట్టి, 'రేపు నీ పెళ్ళయితే మీ ఆయన పండక్కి మా ఊరు రానిస్తాడో లేదో. అందాకన్నా మేము పెట్టింది కాదనకు' అంది నవ్వుతూ.

ఆ సాయంత్రం బొమ్మల కొలువు పేరంటానికి మా ఇంటికి ముత్తయిదువలు వస్తూ పోతూ వుంటే నేను పట్టు లంగా కట్టుకొని, జార్జెట్ వోణీ వేసుకుని అందరికీ పసుపు కుంకాలిస్తూ తెగ హడావిడీ పడిపోయాను. ముభావంగా ఓ మూల కూర్చుని వున్న శారద పిన్నిని 'ఇంటినిండా ఏమిటీ న్యూసెన్స్ అసహ్యంగా' అని ఆయన చిరాకు పడు తున్నారు. 'చదువుకున్న దానివి నీకయినా బుద్ధి లేదు' అని నన్ను కోప్పడుతున్నారు అంది మూతిని మరింత ముడుస్తూ.

"హతోస్మి శుభమా అని పండుగ చేసుకుంటుంటే న్యూసెన్స్, గీసెన్స్ అంటూ ఏమిటోయ్ మీ ఆయన బడాయి. కొత్తల్లుడ్ని కదా అని ఫోజు కొడుతున్నాడా" అన్నాను శారదను ఆటపట్టిస్తూ.

వంటింట్లో సాయంత్రం వంటకు సిద్ధం చేస్తూ అమ్మ అమ్మమ్మ కబుర్లు చెప్పుకుంటున్నారు.

నేను రంగురంగుల పతంగులు తయారు చేయటలో బిజీగా వున్నాను. "మగరాయుడిలా నీకు పతంగు లెందుకే" అన్న అమ్మమ్మ మాటలు ఈ చెవిన విని ఆ చెవిన వదిలేసాను. తల్లీకూతుళ్ళిద్దరూ సీరియస్‌గా మాట్లాడుకుంటున్నారు లోపల-

"అమ్మా! ఏ నాడయినా కాస్త అనువయిన చీర పెట్టావే నాకు. నీకు ఎంతయినా ఆడపిల్లలంటే చిన్నచూపే లేవే?" అంటోంది అమ్మ అమ్మమ్మతో.

"నాకు మాత్రం మంచి చీర పెట్టాలని ఉండదటే. ఏం చేయను చెప్పు. మీ నాన్నగారు పోయినప్పటి నుండి ఇంటి భారమంతా మీ తమ్ముడి మీద పడి పోయింది. వ్యవసాయం చూస్తే అంతంత మాత్రంగా వుంది. వచ్చింది సంవత్సరమంతా చేసిన అప్పులకు, పొలం పెట్టుబడికే సరిపోతున్నది. భూమిని నమ్ము కున్నవాడికి అది ఎంతిస్తే అంతే గానీ మరో మార్గం వుండ దుగా సంపాదనకి. అది పండిన నాడు పండుతుంది. ఎండిననాడు ఎండు తుంది. మీ ఉద్యోగస్థులలా నెలకు ఠంచనుగా ఇన్ని డబ్బులు చేతుల్లో పడతాయన్నట్లు వుండదు మాకు" అంది అమ్మమ్మ సంజా యిషీ చెబుతున్నట్లు.

"అమ్మకు అలమారా నిండా రకరకాల చీరలు వున్నాయి. అయినా అమ్మమ్మ పెట్టే ఆ ఒక్క చీర కోసం ఎందుకు ఇంతగా సాధిస్తున్నది" అనుకున్నాను సాలోచనగా. "ఆడపిల్ల పుట్టింటి కాశపడును' అని సుభద్రా పరి ణయం పాఠంలో కాబోలు చదువుకున్న విషయం గుర్తొచ్చి సమాధాన పడిపోయాను.

క్రితం రోజు పట్టు పరికిణీ కట్టుకొని బొమ్మల కొలువు పెట్టుకున్న నేను, ఆ రోజు జీన్స్ ప్యాంటు, టీషర్టు వేసుకుని మేడ మీద పతంగులు ఎగరవేస్తుంటే అమ్మమ్మ నా వంక నమ్మశక్యం కానట్లు చూసింది.

"ఆ పిల్లేనా ఈ పిల్ల" అని బుగ్గలు నొక్కుకుంది కూడా. నేను పతంగులు ఆడుతుంటే శారద, వాళ్ళ ఆయన మేడమీదకి వచ్చారు. సంప్రదాయ బద్ధంగా ఉన్నప్పటి కన్నా అలా మోడ్రన్ డ్రస్ వేసుకుని పతంగులు ఆడటం ఆయనకు చాలా నచ్చినట్లుంది. 'నువ్వు అలా ఎగరేయగలవోయ్ పతంగులు' అన్నాడు భార్యనుద్దేశించి.

సమాధానంగా శారద సిగ్గుపడి ఊరుకుంది.

"ఏమోయ్ శారూ! మీ అన్నయ్య మరీ అలా నాసిరకం ప్యాంటు, షర్టు తెచ్చాడేమిటి పండక్కి. మా ఇంట్లో పనివాళ్ళు కూడా అలాంటి గుడ్డలు కట్టుకోరు" అంటున్న శారద పతిదేవుడి మాటలు నా చెవిలో పడి నాకు వళ్ళు మండింది. ఎడాపెడా నాలుగు దులపక నాటకంలో డైలాగు మర్చిపోయిన నటిలా మౌనంగా శారద అలా నిల్చుండిపోవటంతో నాకు మరింత కోపం వచ్చింది.

పండుగలు, సంప్రదాయాలు ట్రాష్‌లా, పేరంటాలు న్యూసెన్స్‌లా కనిపించే ఈ ప్రబుద్ధుడికి "అల్లుడికి బట్టలు పెట్టే కార్యక్రమం' మాత్రం అంతగా నచ్చిందా! వాళ్ళ శక్తి కొలది వాళ్ళు పెడితే మంచి మనసుతో స్వీకరించక వెటకారాలు కూడానా! అనుకున్నాను మనసులోనే.

ఆ రాత్రి కాస్త మజ్జిగ తాగి పడుకుందామని వంటింట్లోకి వెళ్ళబోతున్న నాకు ఎవరో ముక్కు చీదుతూ సన్నగా ఏడుస్తున్నట్లు వినిపించింది.

"అన్నపూర్ణా ఎందుకలా బాధ పడుతున్నావు" అది మామయ్య గొంతు.

వెనకగా వచ్చి అనుకోకుండా మామయ్య అలా అడగడంతో అత్తయ్య ఖంగారు పడిపోయి చకచకా పైట చెంగుతో కళ్ళు అద్దుకుంది.

"అబ్బే! ఏమీ లేదండీ. పండుగ రోజు అమ్మ ఒక్కతే ఆ లంకంత ఇంట్లో ఎలా వుందోనని గుర్తు వచ్చి బాధపడుతున్నాను అంతే. నాకు పెళ్ళి చేసి పంపించిన తర్వాత అమ్మ ఒంటరిదైపోయింది కదండీ పాపం".

"నేను ముందే చెప్పాను. ఆమెను కూడా ఇక్కడికి రమ్మని రాయమని. ఆమెకు కొడుకైనా, కూతురివైనా నువ్వే కదా."

"రాసానండి. కానీ ఆమె వినదు. పండుగపూట ఇంట్లో దీపం పెట్టే దిక్కు లేనట్లు ఇంటికి తాళం వేసి నేను ఎక్కడికీ రాను అంటుంది"

"పోనీ నువ్వయినా వెళ్ళాల్సిందే,"

"భలేవారే, నా ఇంటికి ఆడపడుచులు వస్తుంటే ఇంట్లో వాళ్ళకు బొట్టు పెట్టి చీరాసారే పెట్టే దిక్కు కూడా లేకుండా నేను వెళ్ళి నా పుట్టింట్లో కూర్చోనా? మీ నాన్నగారు పోయిన తర్వాత వాళ్ళకు అచ్చటా ముచ్చటా తీర్చాల్సిన పుట్టింటి బాధ్యత మనదే కదా!" అంది అత్తయ్య నిండుమనసుతో.

అత్తయ్యను చూస్తుంటే నాకు జాలి వేసింది. అత్తింటి బాధ్యతలకు, పుట్టింటి మమకారానికి మధ్య ఆడపిల్లలు మానసికంగా ఎలా నలిగిపోతారో అత్తయ్యను చూస్తుంటే అవగాహన అయింది.

ఎన్నో వేడుకలు, సంబరాలు తెచ్చిన సంక్రాంతి పండుగ ఎలాగయితేనేం ఆ సంవత్సరానికి ముగిసిపోయింది. పండుగరోజు రాత్రే ప్రయాణం కట్టాడు కొత్తల్లుడు భార్యతో సహ సెలవు లేదంటూ.

ఆ మర్నాడు కనుమ పండుగని అమ్మమ్మ మమ్మల్ని వెళ్ళనీయలేదు.

"ఎంతో సందడిగా వుంది ఇల్లంతా, మీరంతా వెళ్లిపోతే ఇక చిన్నబోతుంది" అని మేము వెళ్ళే రోజు బండి దాకా వచ్చింది అమ్మమ్మ మమ్మల్ని సాగనంపటానికి.

"అమ్మా! నీ ఆరోగ్యం జాగ్రత్త. వస్తాను" అని పమిట చెంగుతో కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ బండెక్కింది అమ్మ ఒక్క చీర కోసం అమ్మమ్మతో పోట్లాడిన అమ్మ ఇప్పుడు కళ్ళనీళ్ళు పెట్టుకోవడం, వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళటం నాకు ఆశ్చర్యం కలిగించింది.

"అమ్మ సాధించింది అఫ్ట్రాల్ ఒక్క చీర కోసం కాదు. ఆ ఇంట్లో తన ఆడపడుచు తనాన్ని నిలబెట్టుకోవడం కోసం - అందరికీ గుర్తు చేయడం కోసం" అని ఆలోచించగా అప్పుడు బోధపడింది నాకు.

"మళ్ళీ మా ఊరు ఎప్పుడొస్తావే శిరీషా" అని అడిగింది అమ్మమ్మ బండి కదులుతున్నప్పుడు.

"మళ్ళీ వచ్చే సంక్రాంతికి అమ్మమ్మా నేను ఎక్కడున్నా సంక్రాంతికి ఈ ఊరు రాకుండా మాత్రం ఉండను" అన్నాను బైబై చెబుతూ.

అల్లుళ్ళ అలకలు-

ఆడపడుచుల సాధింపులు-

కోడళ్ళు గుంభనంగా పుట్టింటి మమకారాలను అణచిపెట్టి, అత్తింటివారికి చేసే అతిథి మర్యాదలు-

వీటన్నింటి మధ్య మొత్తానికి పండుగ చాలా సరదాగా గడిచిపోయింది.

మళ్ళీ సంక్రాంతి వచ్చేవరకు సరిపడ తీపి అనుభవాలను మిగిల్చిపోయింది.❐


స్త్రీల టానిక్

లోధ్ర

బాధారహిత
ఆరోగ్యమును స్త్రీలకు
90 సంవత్సరములుగా ఇచ్చుచున్నది.




స్త్రీలకు కలుగు అకాల బహిష్టు,
ముట్టుకుట్టు, ఋతురక్తం
ఎక్కువతక్కువగాపోవుట, నడుము నొప్పి,
సంతానహీనత, గర్భకాలపు జబ్బులకు
ఉచిత వైద్య సలహా కొరకై
ఈ ప్రక్క చిరునామాతో
సంప్రదించండి

తయారుచేయువారు:

కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్
రాయపేట, మద్రాసు – 600 014.

ఏజంట్లు : సీతారామ జనరల్ స్టోర్సు ఏజన్సీస్,
విజయవాడ – 1 – సికిందరాబాద్